


అప్పుడే రైలు దిగిన నాగభూషణరావు చేతిలో సూట్ కేస్ పట్టుకుని స్టేషను బయటికి వచ్చాడు. "రిక్షా కావాలా సార్?" అంటూ తన చుట్టూ ముసిగిన రిక్షావాళ్ళని ఒకసారి కళ్ళు చిట్లించి విసుగ్గా చూశాడు.

"ఏరా...వస్తావా?"

"చెప్పండి సార్ ... ఎక్కడికి?" అన్నాడు వాడు సీటు దులుపుతూ.

"గాంధీ చౌక్."

"రండి...కూర్చోండి."

"ఏం పుచ్చుకుంటావ్?"

"రూపాయి ఇప్పించండి సార్."

"ముప్పావలా ఇస్తాను...వస్తావా?

"అబ్బే...కుదరదండీ...ఎత్తు-పైగా ఎదురుగాలి."

"అయితే పో..."

ఇంకో రిక్షావాడిని అడిగాడు నాగభూషణరావు.

"ఏటి ... గాంధీ చౌకేనా? ... రూపాయి యిప్పించండి దొరా!"

ముప్పావలాకి ఒక్క-పైసా కూడా ఎక్కువ యివ్వనని చెప్పి ముందుకు అడుగులు వేశాడు.

"ఇదిగో రిక్షా ... నిన్నే...గాంధీ చౌక్ వస్తావా?"

"ఆ...రూపాయిపావలా యిప్పించండి"

"ఏవిటీ?!...రూపాయిపావలా నా?! ...నేనీ ఊరికి క్రొత్తనుకున్నావా ఏమిటి? ... ముప్పావలా యిస్తాను... వస్తేరా-లేకపోతే పో..."

"ఎప్పుడైనా రిక్షా ఎక్కిన మొగమేనా ఇది" అని పొగరుగా అంటూ వెళ్ళిపోయాడు వాడు.

నాగభూషణరావుకి వాడిమీద గొంతు దాకా కోపం వచ్చింది. కాని ఏం చెయ్యగలడు?...




ఇంకొంతమందిని అడిగాడు. ఎవ్వరూ రూపాయికి తగ్గలేదు. నిజానికి స్టేషనునుంచి గాంధీచౌక్ కి ముప్పావలా సరియైన ధరే: కాని రైల్లోంచి దిగినవాళ్లు బాగా ఎంత చెప్పినా వస్తారని రిక్షా వాళ్ళు వాళ్లిష్టమొచ్చిన విధంగా అడుగుతుంటారు.

నాగభూషణరావుకి విసుగుపుట్టింది. ప్రయాణంచేసి చాల బడలికగా ఉంది. దానికితోడు రాత్రంతా రైల్లో నిద్రలేదు. "పోనీలే ... ఒక్క పావలాతో నేను మిగిల్చేదేమిటి? ... రూపాయి యిచ్చి వెళ్లిపోతాను" అనుకున్నాడు.

"ఏయ్ రిక్షా ... గాంధీచౌక్ కి వస్తావా?" అంటూ ఒక రిక్షావాడిని అడిగాడు.

"రండి బాబూ...కూర్చోండి"

"ఏం తీసుకుంటావ్?"

వాడెలాగూ రూపాయి అడుగుతాడని అనుకుంటూ ప్రశ్నించాడు నాగభూషణరావు,

"ముప్పావలా యిప్పించండి బాబయ్యా!..." అన్నాడు రిక్షావాడు అతివినయంగా.

"పదణాలు ఇస్తాను ... వస్తావా? ..." అన్నాడు నాగభూషణరావు.